సాక్షి వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 7 । జూలై । 2023



కడప వేదికగా మరో క్రికెట్ టోర్నీ

కడప నగరం వేదికగా ఈనెల 7 నుంచి 25వ తేదీ వరకు మరో క్రికెట్ టోర్నీ ప్రారంభం కానుంది. -8లో



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాల చేరిక

వేముల మండలం చింతలజూటూరు గ్రామానికి చెందిన సుమారు 50కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. -8లో



శ్రీనివాసుల రెడ్డి హత్యలో.. ప్రధాన కుట్రదారుడు సుబ్బారెడ్డి

వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో ప్రధాన కుట్రదారుడు టీడీపీ నేత సుబ్బారెడ్డిగా పోలీసులు తేల్చారు. - 8లో

న్యూస్‌రీల్

పేర్లు నమోదు చేసుకోండి

కడప స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో అర్హత కలిగిన రెఫరీలు, కోచ్‌లు, అన్ని వయో విభాగాలకు చెందిన క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం వైఎస్సార్ కడప జిల్లా కార్యదర్శి మామిడి సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు చేయించుకోకపోతే జిల్లా సంఘం తరఫున పోటీల్లో పాల్గొనేందుకు పరిగణలోకి తీసుకోమన్నారు. త్వరలోనే అండర్–14, 17 విభాగాల్లో జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పేర్ల నమోదు కోసం 9912020424, 9959006388 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

బీఎఫ్‌ఏలో ప్రవేశానికి గడువు పొడిగింపు

వైవీయూ: యోగివేమన యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ (బీఎఫ్‌ఏ) కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తుల గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులని, ఆసక్తి గలవారు ఓఏఎండీసీ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9492345419, 9010014304 నంబర్లలో సంప్రదించాలన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 12 మంది డిబార్

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో గురువారం 12 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురిని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి డిబార్ చేశారు. స్క్వాడ్ సభ్యులు ఆచార్య రాఘవప్రసాద్, గంగిరెడ్డి, ఎంవీ శంకర్, చంద్ర ఓబుల్‌రెడ్డిలు వీరబల్లి, రాయచోటి, సుండుపల్లె కేంద్రాలను తనిఖీ చేసి ఏడుగురు విద్యార్థులను డిబార్ చేశారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

నాడు వెలవెల.. నేడు జలకళ!

- తెలుగుగంగ అభివృద్ధి పనులను విస్మరించిన టీడీపీ ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక జోరందుకున్న పనులు
- డయా ఫ్రం వాల్ లీకేజీ పనులకు రూ. 60 కోట్లు
- పెండింగ్‌లో ఉన్న రూ. 420 కోట్లు జలయజ్ఞం బిల్లుల చెల్లింపు
- రూ.6 కోట్లతో చింతలచెరువు కాంప్లెక్స్ పనులు
- రూ. 35 కోట్లతో కాశినాయన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు
- కుందూ లిఫ్ట్‌కు రూ. 450 కోట్లు



తెలుగుగంగ ప్రాజెక్టు

కడప సిటీ: గత టీడీపీ ప్రభుత్వం తెలుగుగంగ ప్రాజెక్టు అభివృద్ధి పనులను విస్మరించింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక కోట్లాది రూపాయల వ్యయంతో తెలుగుగంగకు సంబంధించిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి అభివృద్ధికి తోడ్పాటు అందించారు. 2006లో పెండింగ్‌లో ఉన్న జలయజ్ఞం బిల్లులు కూడా ఈ ప్రభుత్వం వచ్చాకే రూ. 420 కోట్లు చెల్లించింది. పెండింగ్ పనులను పూర్తి చేసింది కూడా ఈ ప్రభుత్వమే. డయా ఫ్రం వాల్ (ఆనకట్ట)కు సంబంధించిన లీకేజీలను అరికట్టడంలో గత ప్రభుత్వాలతోపాటు టీడీపీ ప్రభుత్వం కూడా వైఫల్యం చెందింది. ఈ కారణంగా తెలుగుగంగ ప్రాజెక్టులో కేవలం 12 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉండేందుకు అవకాశం ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పనులకు రూ. 60 కోట్లు వెచ్చించి ప్రత్యేక నిపుణులను రప్పించి లీకేజీలను అరికట్టడంతో ప్రస్తుతం తెలుగుగంగ ప్రాజెక్టు నీటి సామర్థ్యం పూర్తి స్థాయిలో నింపేందుకు అవకాశం ఏర్పడింది. అంతేకాకుండా కుడి, ఎడమ కాలువలకు సంబంధించిన పెండింగ్ పనులు 10 శాతానికి సంబంధించి ఈ ప్రభుత్వమే రూ. 25 కోట్లు నిధులు ఇవ్వడంతో పనులు చకాచకా జరుగుతున్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే ఆయకట్టుకు రెండు సీజన్లలో నీరందించే అవకాశం ఉంటుంది. ఎస్‌ఆర్–1, ఎస్‌ఆర్–2, తెలుగుగంగకు సంబంధించిన దాదాపు 70 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందడమే కాకుండా ఆయా చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాలు పుష్కలంగా పెంపొందించే అవకాశంతోపాటు తాగునీటిని కూడా అందించేందుకు వీలుంటుంది.

రూ. 420 కోట్లు జలయజ్ఞం బిల్లుల చెల్లింపు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం పేరిట పలు సాగునీటి ప్రాజెక్టు పనులను చేపట్టారు. అందులో భాగంగానే తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించి పలు అభివృద్ధి పనులను నిర్వహించారు. ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు ఈ పనులకు బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తుండడం వల్ల అంచనా వ్యయం మరింత పెరిగి భారంగా మారింది. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఒకటో ప్యాకేజీకి సంబంధించిన రూ. 220 కోట్లు, రెండవ ప్యాకేజీకి చెందిన రూ. 200 కోట్లు కలిపి మొత్తం రూ. 420 కోట్లు ఈ ప్రభుత్వమే చెల్లించింది.

కుడి, ఎడమ కాలువల పెండింగ్ పనులకు రూ.25 కోట్లు: తెలుగుగంగ ప్రాజెక్టుకు కుడి కాలువ 45 కిలోమీటర్లు, ఎడమ కాలువ 57 కిలోమీటర్ల మేర పొడవు ఉన్నాయి. అయితే ఈ పనులు అక్కడక్కడా పెండింగ్‌లో ఉన్నాయి. 90 శాతం పనులు కాగా, 10 శాతం పనులు అలాగే నిలిచిపోయాయి. ప్రస్తుతం కుడి కాలువకు సంబంధించి 31 కిలోమీటరు వద్ద పనులు జరుగుతున్నాయి. ఈ కాలువ నిర్మాణానికి రూ. 13 కోట్లు, అలాగే ఎడమ కాలువకు సంబంధించిన పనులకు రూ. 12 కోట్లు కలిపి మొత్తం రూ. 25 కోట్లను ఈ ప్రభుత్వమే నిధులను సమకూర్చింది.

చింతలపల్లె చెరువు కాంప్లెక్స్‌కు రూ. 6 కోట్లు

పోరుమామిళ్ల సమీపంలో చింతలపల్లె చెరువు కాంప్లెక్స్ పనులకు రూ. 6 కోట్లను ఈ ప్రభుత్వమే మంజూరు చేసింది. ఈ నిధులతో రెండు వంతెనల నిర్మాణంతోపాటు చెరువు అభివృద్ధి పనులను పూర్తి చేసింది. ఈ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్ల క్రితం బద్వేలు పర్యటనకు వచ్చిన సందర్భంలో ఈ హామీని ఇచ్చి నెరవేర్చారు.

కాశినాయన లిఫ్ట్‌కు రూ. 35 కోట్లు

తెలుగుగంగ ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి కాశినాయన లిఫ్ట్ ఇరిగేషన్ పేరిట పథకం రూపొందించారు. ఇందుకు ఆయకట్టు ఆరు వేల ఎకరాలుగా ఉంది. ఇందుకుగాను రూ. 35 కోట్లను కేటాయించారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఈ లిఫ్ట్ ద్వారా ఐదు చెరువులను నింపడంతో ఆయకట్టుకు నీటితోపాటు భూగర్భ జలాలను పెంపొందించడం, తాగునీటిని కూడా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

కుందూ లిఫ్ట్‌కు రూ. 450 కోట్లు

కుందూ లిఫ్ట్ ద్వారా తెలుగుగంగ ప్రాజెక్టులో ఎప్పటికీ పూర్తి నీటి సామర్థ్యం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కుందూ లిఫ్ట్ నుంచి ఎస్‌ఆర్–1కు నీళ్లను పంపింగ్ చేసి అక్కడి నుంచి తెలుగుగంగ ప్రాజెక్టుకు నీళ్లు చేరడం వల్ల నిండుకుండలా తెలుగుగంగ ప్రాజెక్టు ఉండేందుకు వీలుంటుంది. అయితే ఈ పనులకు సంబంధించి డిజైన్ వర్క్, జెన్‌కో అప్రూవల్స్, ట్రాన్స్‌కో అప్రూవల్స్ జరగ్గా, పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది.

లీకేజీ అరికట్టేందుకు రూ. 60 కోట్లు

తెలుగుగంగ ప్రాజెక్టు డయా ఫ్రం వాల్ (ఆనకట్ట)కు సంబంధించి లీకేజీల కారణంగా ప్రాజెక్టులో పూర్తి నీటి సామర్థ్యం ఉంచేందుకు వీలు లేకుండా ఉండేది. ఎప్పటినుంచో ఈ పరిస్థితి ఉన్నప్పటికీ గత పాలకులుగానీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంగానీ ఈ పనులను విస్మరించడంతో తెలుగుగంగ ప్రాజెక్టులో పూర్తి నీటి సామర్థ్యాన్ని కలిగి ఉండేందుకు ఆటంకంగా ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చాక ఈ పనులకు రూ. 60 కోట్లు కేటాయించింది. ప్రత్యేక నిపుణులచే అధునాతనమైన యంత్రాలతో ఈ పనులను చేపట్టి లీకేజీలను అరికట్టారు. లీకేజీలను అరికట్టకముందు కేవలం ప్రాజెక్టులో 12 టీఎంసీల కన్నా ఎక్కువ నీటిని నిల్వ చేసేందుకు వీలుండేది కాదు. తెలుగుగంగ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 17. 7 టీఎంసీలు కాగా ప్రస్తుతం 10.5 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. అయితే ఈ లీకేజీలను అరికట్టడం వల్ల ప్రస్తుతం 17.7 టీఎంసీల పూర్తి నీటి సామర్థ్యాన్ని ప్రాజెక్టులో నింపేందుకు మార్గం సుగమమైంది.



అధునాతన యంత్రాలతో డయా ఫ్రం వాల్ లీకేజీ పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

పూర్తి ఆయకట్టుకు నీళ్లిచ్చేందుకు చర్యలు



తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి ఆయకట్టుకు నీళ్లిచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. కుందూ లిఫ్ట్‌కు సంబంధించిన పనులు కూడా త్వరలో ప్రారంభించేందుకు అవకాశం ఉంది.

– వెంకట్రామయ్య, ఎస్‌ఈ, తెలుగుగంగ ప్రాజెక్టు

రేపటి నుంచి సీఎం వైఎస్ జగన్ జిల్లా పర్యటన

పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు



కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జిల్లా పర్యటనకు వస్తున్నట్లు అధికారికంగా సమాచారం అందింది. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదివారం గండికోట, పులివెందులలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. సోమవారం కడప నగరంతోపాటు కొప్పర్తి పారిశ్రామికవాడను సందర్శించి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు.

8వ తేదీ పర్యటన ఇలా..

- మధ్యాహ్నం 1.30 గంటలకు కల్యాణదుర్గంలో బయలుదేరి 1.55 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 2.05 గంటలకు వైఎస్సార్ ఘాట్ వద్దకు వెళతారు.
- 2.25 గంటల వరకు అక్కడ జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తారు.
- 2.25 గంటలకు ఘాట్ నుంచి బయలుదేరి ప్రేయర్ హాలుకు 2.30 గంటలకు చేరుకుంటారు.
- 5.30 గంటల వరకు సింహాద్రిపురం మండల ప్రజా ప్రతినిధులతో సమావేశమవుతారు.
- 5.35కు హెచ్‌సీఎం రెసిడెన్స్‌కు చేరుకుంటారు.

9వ తేదీ..

- ఉదయం 8.50 గంటలకు హెచ్‌సీఎం రెసిడెన్సీ నుంచి బయలుదేరి 8.55 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 9.20 గంటలకు గండికోట హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 9.30 గంటలకు ఒబెరాయ్ హోటల్ శంకుస్థాపనలో పాల్గొంటారు.
- 10.15 గంటలకు గండికోట వ్యూ పాయింట్‌కు చేరుకుంటారు.
- 10.25 గంటలకు బయలుదేరి 10.30 గంటలకు గండికోట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.50 గంటలకు పులివెందుల భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.05 గంటలకు పులివెందుల కొత్త మున్సిపల్ కార్యాలయ భవనం వద్దకు చేరుకుంటారు.
- 11.40 గంటల వరకు మున్సిపల్ కార్యాలయ భవన ప్రారంభోత్సవం, పులివెందుల కౌన్సిలర్లతో సమావేశమవుతారు.
- 11.45 గంటలకు రాణితోపు చేరుకుంటారు.
- 12.10 గంటల వరకు పులివెందుల సిటీ ఫారెస్టు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 12.15 గంటలకు గరండాల రివర్ ఫ్రంట్‌కు చేరుకుని గరండాల కెనాల్ డెవలప్‌మెంట్ మొదటి దశ పనులను ప్రారంభిస్తారు.
- 12.50 నుంచి 1.15 గంటల వరకు వైఎస్సార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- 1.25 గంటలకు న్యూటెక్ బయోసైన్స్, ఏపీ కార్ల్‌లో ప్రారంభోత్సవాల్లో గడుపుతారు.
- 1.50 గంటలకు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 2.20 గంటల వరకు రిజర్వు
- 2.30 గంటలకు వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- 3.10 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 3.15 గంటలకు బయలుదేరి 3.35 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 3.35 నుంచి 4.05 గంటల వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు.
- 4.10కి హెచ్‌సీఎం రెసిడెన్స్‌కు చేరుకుంటారు.

10వ తేదీ..

- ఉదయం 8.50 గంటలకు హెచ్‌సీఎం రెసిడెన్స్ నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 9.20 గంటలకు కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 9.25 నుంచి 10.00 గంటల వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు.
- 10.00 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 10.10 గంటలకు రాజీవ్ మార్గ్ చేరుకుంటారు.
- 10.20 గంటల వరకు రాజీవ్ మార్గ్ రోడ్డు ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- 10.25కు రాజీవ్ పార్కు చేరుకుంటారు.
- 10.35 గంటల వరకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేస్తారు.
- 10.50 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 11.00 గంటలకు కొప్పర్తి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.10 గంటలకు అల్ డిక్సన్ యూనిట్‌కు చేరుకుని ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 11.35 నుంచి 11.45 గంటల వరకు పారిశ్రామిక యూనిట్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో గడుపుతారు.
- 11.55 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 12.10 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 12.15 గంటలకు విమానాశ్రయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.00 గంటకు గన్నవరం విమానాశ్రయానికి వెళతారు
- 1.30 గంటలకు సీఎం నివాసానికి వెళతారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాట్లు



ఇడుపులపాయలో సీఎం పర్యటన ప్రాంతాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, తదితరులు

కడప అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప నగర పర్యటన నేపథ్యంలో ఆర్ట్స్ కళాశాలలోని హెలీప్యాడ్, రాజీవ్‌మార్గ్, రాజీవ్ పార్క్, ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజుతో కలిసి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అధికారులు గురువారం పరిశీలించారు. చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు ఎస్పీ సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ రాజాప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటన ప్రాంతాల పరిశీలన

పులివెందుల రూరల్ : సీఎం వైఎస్ జగన్ పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన పర్యటించే ప్రాంతాలను జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్‌లు అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పులివెందుల పట్టణ శివార్లలోని భాకరాపురం వద్ద హెలీప్యాడ్‌తోపాటు పరిసర ప్రాంతాలను అలాగే నూతన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ భవనం, కొత్తగా అభివృద్ధి చేసిన పులివెందుల సిటీ ఫారెస్ట్ ప్రాంగణంలోని గరండాల్ రివర్ ఫ్రంట్, నగర వనం గార్డెన్లను వారు పరిశీలించారు. వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమి బ్లాక్, ఆడిటోరియం శ్రీస్వామి నారాయణ్ గురుకుల ఇంటర్నేషనల్ స్కూలు, ఏపీ కార్ల్ ప్రాంగణంలోని నూటెక్ బయోసైన్సెస్, స్పోర్ట్స్ అకాడమి కాంప్లెక్ కొత్త హాకీ, ఆర్చరీ బ్లాక్‌లు, ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శిలా ఫలకాలు, పారిశుధ్య నిర్వహణ, బారికేడింగ్, భద్రతా ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె: సీఎం వైఎస్ జగన్ ఇడుపులపాయ పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు నిర్వహించాలని కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం వారు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిలతో కలిసి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్, వైఎస్సార్ గెస్ట్‌హౌస్, ఆర్‌కే వ్యాలీ పోలీస్‌స్టేషన్ నూతన భవనం, ఓపెన్ ఎయిర్ చర్చి (ప్రార్థనా మందిరం) తదితర ప్రాంతాలను పరిశీలించారు. డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, వేంపల్లె తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, డీఎస్పీ వినోద్‌కుమార్, ఆర్‌కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి,భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు బిందు సేద్య పరికరాలు

- ఏపీ ఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రవీంద్రనాథరెడ్డి

కడప అగ్రికల్చర్: బిందు, తుంపర సేద్యానికి అర్హులైన ప్రతి రైతుకు పరికరాలను అందచేస్తామని ఏపీ ఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. కడపలో గురువారం ఆయన జిల్లా కంపెనీ ప్రతినిధులతో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పరికరాలు అవసరం ఉన్న రైతులు ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్‌ను చేసుకుంటారని, వారు ఎంపిక చేసుకున్న కంపెనీకి సంబంధించిన పరికరాలను అందచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివశ్రుతి.. విద్యార్థులకు స్ఫూర్తి

'నా విద్యా జీవితం ముగిసింది. నేను ఇక చదువుకు దూరమైనట్లే. నాకు చదువుకునే యోగం, అదృష్టం లేదు' అని వేదనకు గురైన పదేళ్ల చిన్నారికి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) కొత్త జీవితాన్ని ప్రసాదించింది. నాడు అక్కడ పడిన విద్యాబీజం ఇంతింతై మహా వృక్షమై నేడు అదే పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేసే భాగ్యాన్ని కల్పించింది. నేటితరం విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిన శివశ్రుతి విజయగాథపై ప్రత్యేక కథనం..



కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా అధికారుల నుంచి నియామకపత్రాన్ని అందుకుంటున్న శివశ్రుతి(ఫైల్)



కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శివశ్రుతి(ఫైల్)

- ఆర్థిక ఇబ్బందులతో అర్ధంతరంగా ఆగిన చదువు
- వెన్నుతట్టి విద్యా వెలుగులు ప్రసాదించిన కేజీబీవీ
- అంచెలంచెలుగా ఎదిగి నేడు అదే పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా ఎంపికైన శివశ్రుతి



కడప ఎడ్యుకేషన్: శివశ్రుతి తండ్రి శ్రీనివాసులు కారు డ్రైవర్, తల్లి రాజేశ్వరి గృహిణి. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఆమె తమ సొంత ఊరు ఖాజీపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివింది. ఆ సమయంలో తండ్రి జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా పెద్దగా సంపాదన లేక తిరిగి సొంత ఊరికి వచ్చాడు. ఇక్కడా ఉండలేక కుటుంబంతో సహా తిరుపతికి వలస వెళ్లాడు. అక్కడ కారు డ్రైవర్‌గా ఉంటూ పిల్లలిద్దరిని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాడు. చివరకు పిల్లలకు స్కూల్ ఫీజులు కూడా కట్టలేని స్థితిలో చేసేది లేక పిల్లల చదువులను అర్ధంతరంగా మాన్పించి తమ అత్త గారి ఊరైన చక్రాయపేటకు సంసారాన్ని మార్చాడు. దీంతో 6వ తరగతి చదువుతున్న శివశ్రుతి చదువు ఆగిపోయింది. ఏడాదంతా ఆమె ఇంట్లోనే ఉండిపోయింది. తరువాత సంవత్సరం డ్రాపౌట్ కింద పక్కింటి ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాతో చక్రాయపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 7వ తరగతిలో చేరింది. ఇక వెనుతిరిగి చూడకుండా పీజీ వరకు తన చదువును నిర్విఘ్నంగా కొనసాగించింది. ఏ పాఠశాల అయితే తన జీవితానికి ఓ వెలుగుదారి చూపిందో అదే పాఠశాలకు నేడు శ్రుతి ప్రిన్సిపాల్‌గా ఎంపికై పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

కేజీబీవీ నుంచి పీజీ వరకు...

ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలో చదివిన శివశ్రుతి 7వ తరగతి తరువాత తన చదువంతా కేజీబీవీలోనే ఉచితంగా కొనసాగించింది. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించింది. దీంతో కడప రత్నాల కింద ఎంపికై కడపలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ విద్యను ఉచితంగా చదువుకుంది. ఇంటర్‌లో 75 శాతం మార్కులను సాధించడంతో కడపలోని కోటిరెడ్డి మహిళా కళాశాలలో సీటు సంపాదించుకుని స్కాలర్‌షిప్‌తో డిగ్రీ చదివింది. తరువాత పీజీని కడపలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో పూర్తి చేసింది. అనంతరం బీఈడీ కూడా పూర్తి చేసింది.

2021లో ఉద్యోగంలోకి ..

పీజీ పూర్తి చేసిన శివశ్రుతి 2021లో ఓబులవారిపల్లె కేజీబీవీలో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ)గా చేరింది. అక్కడ ఆరు నెలలు పనిచేశాక టెట్ క్వాలిఫై కావాలనడంతో ఉద్యోగాన్ని మాని టెట్ పరీక్ష రాసి క్వాలిఫై అయింది.

విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకే..

ఏ పాఠశాలలో అయితే తన హైస్కూలు విద్యను ఉచితంగా పూర్తి చేసిందో అదే కేజీబీవీ పాఠశాలకు శివశ్రుతి నేడు ప్రిన్సిపాల్‌గా వెళ్లింది. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కేజీబీవీ పోస్టులకు ఆమె దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ ఆధారంగా ఆమెను కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేశారు. సుండుపల్లి కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా మూడు రోజుల క్రితం విధుల్లో చేరారు.

కుటుంబానికి ఆసరాగా..

కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న శివశ్రుతి తండ్రి శ్రీనివాసులుకు పక్షవాతం సోకి మంచానికే పరిమితమయ్యారు. ఈ పరిస్థితిలో కుమారుడు శశికృష్ణ తన డిగ్రీ చదువును మానేసి తండ్రి బాటలోనే మరో కారుకు డ్రైవర్‌గా వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో శివశ్రుతికి ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం రావడంతో ఆమె ఆ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది.

చాలా సంతోషంగా ఉంది..



నాకు కేజీబీవీలో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. ఎందుకుంటే అర్ధంతరంగా ఆగిన నా చదువుకు మళ్లీ జీవం పోసింది కేజీబీవీనే. ప్రస్తుతం అదే పాఠశాలకు ప్రిన్సిపాల్ కావడం అదృష్టం. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తా.

– శివశ్రుతి, కేజీబీవీ ప్రిన్సిపాల్, సుండుపల్లి

కడప వేదికగా మరో క్రికెట్ టోర్నీ

– నేటి నుంచి అండర్–19 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

కడప స్పోర్ట్స్ : కడప నగరం వేదికగా మరో క్రికెట్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈనెల 7 నుంచి 25వ తేదీ వరకు ఏసీఏ–సౌత్‌జోన్ అండర్–19 పురుషుల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లలో కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు జట్లు తలపడనున్నాయి. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం/కేఓఆర్ఎం మైదానాల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌ల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు.

మ్యాచ్‌ల షెడ్యూల్

7 నుంచి 9వ తేదీ వరకు కేఎస్ఆర్ఎం మైదానంలో కడప, అనంతపురం జట్లు తలపడనున్నాయి. ఇదే తేదీల్లో వైఎస్ రాజారెడ్డి ఏసీఏ మైదానంలో కర్నూలు, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. 11 నుంచి 13 వరకు కేఎస్ఆర్ఎంలో అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్ఆర్ ఏసీఏ మైదానంలో కడప, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతాయి. ఇక 15 నుంచి 17వరకు కర్నూలు, నెల్లూరు జట్లు కేఎస్ఆర్ఎంలో, కడప చిత్తూరు జట్లు వైఎస్ఆర్ఆర్ ఏసీఏ మైదానాల్లో తలపడతాయి. 19 నుంచి 21 తేదీల్లో కేఎస్ఆర్ఎం మైదానంలో చిత్తూరు, నెల్లూరు జట్లు, వైఎస్ఆర్ఆర్ ఏసీఏ మైదానంలో అనంతపురం, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. 23 నుంచి 25 వరకు కడప, కర్నూలు జట్లు కేఎస్ఆర్ఎంలో మైదానంలో, అనంతపురం, నెల్లూరు జట్లు వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో తలపడనున్నాయి.

కడప డివిజన్ ఇన్‌చార్జి పోస్టల్ సూపరింటెండెంట్‌గా కిరణ్



కడప వైఎస్ సర్కిల్ : కడప డివిజన్ ఇన్‌చార్జి పోస్టల్ సూపరింటెండెంట్‌గా కిరణ్ నియమితులయ్యారు. ఈయన ప్రొద్దుటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇక్కడికొచ్చారు. ఈయన ఇదివరకు మహారాష్ట్రలో కూడా విధులు నిర్వర్తించారు.

• శ్రీనివాసుల రెడ్డి హత్య కేసు...

ప్రధాన కుట్రదారుడు టీడీపీ నేత సుబ్బారెడ్డి!

అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

కడప అర్బన్ : వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసుల రెడ్డి హత్య కేసులో ప్రధాన కుట్రదారుడు టీడీపీ నేత పాలెంపల్లె సుబ్బారెడ్డిగా పోలీసుల దర్యాప్తులో తేల్చారు. ఏ3 నిందితుడు ల్యాబ్ శ్రీనుతో నిర్వహించిన రహస్య ఒప్పందం మేరకు హత్య ప్రణాళిక రచించినట్లు తేటతెల్లమైంది. ప్రధాన నిందితుల రిమాండ్ అనంతరం ఫోన్ కాల్స్, వాట్సాప్ చాటింగ్, గూగుల్ టేకౌట్ పరిశీలన దిశగా దర్యాప్తు చేసిన పోలీసులకు కీలక సమాచారం లభించింది. సుబ్బారెడ్డి కోసం గాలిస్తుండగా అప్పటికే తన మొబైల్ ఫోన్ ఇంట్లో పడేసి, హైదరాబాద్‌కు వెళ్లినట్లు పోలీసులు పసిగట్టారు. వివిధ ప్రాంతాల్లో గాలించిన పోలీసులు టీడీపీ నేత సుబ్బారెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించిన తర్వాత అరెస్టు చేసినట్లు సమాచారం. మరోవైపు ల్యాబ్ శ్రీను టీడీపీ నేత సుబ్బారెడ్డితో చేసుకున్న ఒప్పందం వ్యవహారం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

హతుడు...నిందితులు ఒకనాటి మిత్రులే..

హత్యకు గురైన సి శ్రీనివాసులరెడ్డి, ప్రధాన నిందితులు ప్రతాప్‌రెడ్డి, పాలెంపల్లె సుబ్బారెడ్డి వీరంతా ఒకనాటి మిత్రులే. 2019 ఎన్నికల్లో వీరంతా తెలుగుదేశం పార్టీ విజయం కోసం పనిచేశారు. అప్పటికే కడపలో కొన్ని వివాదాస్పద వ్యవహారాల్లోనూ ముగ్గురు ఉన్నారు. సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి మధ్య విభేదాలు తలెత్తడంతో 2020లో విడిపోయారు. ఆ తర్వాత శ్రీనివాసుల రెడ్డితో సన్నిహితంగా ఉన్న ప్రతాప్ రెడ్డి కూడా అతనితో విభేదాలు వచ్చి విడిపోయాడు. ఈ క్రమంలో ప్రతాప్ రెడ్డి, ల్యాబ్ శ్రీను పాలెంపల్లె సుబ్బారెడ్డితో హత్య విషయమై మంతనాలు నిర్వహించారు. దీనికి సుబ్బారెడ్డి ప్రోత్సాహం ఇవ్వడంతో శ్రీనివాసులరెడ్డి హత్యకు ప్రణాళిక రచించి అంతమొందించారు. కాగా ఇదే విషయమై ల్యాబ్ శ్రీను వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 'శ్రీనువాసులరెడ్డి మాకు మోసం చేశాడు, డబ్బులు ఇవ్వలేదు, శ్రీనువాసులరెడ్డిని హత్య చేయాలనుకుంటున్నాం' అంటూ ఇంటికి వెళ్లి చెప్పినట్లుగా ల్యాబ్ శ్రీను వివరించారు. 'రూ.30 లక్షలు ఇస్తా.. కోర్టు వ్యవహారం చూసుకుంటా'నని సుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్లు ల్యాబ్ శ్రీను అందులో వెల్లడించడం గమనార్హం.



పుత్తా నరసింహారెడ్డి, లోకేష్‌తో ప్రధాన నిందితుడు పాలెంపల్లి సుబ్బారెడ్డి (ఫైల్)

పాలెంపల్లె సుబ్బారెడ్డి అరెస్టు

– కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ వెల్లడి

కడప అర్బన్ : కడప నగరంలోని సంధ్యా సర్కిల్ వద్ద జూన్ 23న ఉదయం చిన్న నాగిరెడ్డి గారి శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో ప్రధాన కుట్రదారుడైన పాలెంపల్లి సుబ్బారెడ్డి అలియాస్ రాజు సుబ్బారెడ్డి (42)ని అరెస్టు చేసినట్లు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ వెల్లడించారు. ఈనెల 5న బుధవారం సాయంత్రం ఇర్కాన్ సర్కిల్ వద్ద అరెస్టు చేసినట్లు వివరించారు. గురువారం సాయంత్రం డీఎస్పీ మీడియాతో మాట్లాడారు. గత నెల హత్యకు గురైన చిన్ననాగిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి ప్రస్తుతం అరెస్టు చేసిన పాలెంపల్లి సుబ్బారెడ్డి ఇద్దరూ 2020 సంవత్సరం వరకూ సన్నిహితంగా ఉంటూ కలిసి వ్యాపారాలు చేసుకునేవారు. అనంతరం ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. పరస్పర దాడులు చేసుకునే స్థితికి వెళ్లారు. ఈ పరిస్థితుల్లో శ్రీనివాసులరెడ్డికి సన్నిహితులుగా ఉన్న ప్రతాప్‌రెడ్డి, ల్యాబ్ శ్రీనివాసులు సైతం విడిపోయారు. దీంతో శ్రీనివాసుల రెడ్డిని హత్య చేసేందుకు ల్యాబ్ శ్రీను సుబ్బారెడ్డితో చర్చలు నిర్వహించారు. హత్య చేసేందుకు నిందితులకు సుబ్బారెడ్డి ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు రూ. 30 లక్షలు డబ్బులు ఇవ్వడంతో పాటు కోర్టు వ్యవహారాలు చూసుకుంటానని భరోసా ఇచ్చాడు. హత్య కేసులో ఇదివరకే అరెస్టు అయిన ఏ3 నిందితుడు మేరువ శ్రీనివాసులు అలియాస్ ల్యాబ్ శ్రీను హత్యకు కొన్ని రోజుల ముందు సుబ్బారెడ్డి ఇంటిలో కూర్చుని హత్యకు కుట్ర చేసినట్లు తమ విచారణలో వెల్లడైంది. హత్య చేసిన తర్వాత ఏ3 అయిన ల్యాబ్ శ్రీను పాలెంపల్లి సుబ్బారెడ్డికి 'హత్య చేశాం..అతను చనిపోయాడు..'అంటూ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. గూగుల్ టేక్ అవుట్ ద్వారా సాంకేతిక ఆధారాలను పరిశీలించి చూడగా సుబ్బారెడ్డి ప్రమేయం స్పష్టమైందని డీఎస్పీ తెలిపారు. నిందితుడు సుబ్బారెడ్డి తన సెల్ ఫోన్‌లోని వాట్సాప్ మెసేజ్‌లను డిలీట్ చేసారు. వాటిని రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని డీఎస్పీ వివరించారు. ప్రస్తుతం అరెస్ట్ చేసిన సుబ్బారెడ్డి పై 12 కేసులు నమోదై ఉన్నాయి. ఇందులో రెండు హత్యాయత్నం కేసులు, రెండు ఆత్మహత్య కు ప్రేరేపించిన కేసులతో పాటు ఎస్.సి.,ఎస్.టి అట్రాసిటీ కేసులోనూ నిందితుడుగా ఉన్నాడు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ షరీఫ్

9న మహిళ క్రికెట్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 9వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లాస్థాయి మహిళల అండర్–15, 19తో పాటు సీనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజా మైనుద్దీన్, ఉమన్ వింగ్ కో–ఆర్డినేటర్ కె. విష్ణుమోహన్‌రావు తెలిపారు.

డిజిటల్ చెల్లింపులు సురక్షితం

కడప కార్పొరేషన్ : విద్యుత్ బిల్లులను డిజిటల్ రూపంలో సురక్షితంగా చెల్లించవచ్చని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వినియోగదారులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ఆన్‌లైన్ యాప్ ద్వారా మొబైల్ ఫోన్ నుంచే బిల్లులు చెల్లించే సౌలభ్యం ఉందన్నారు. విద్యుత్ సమస్యలపై 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చన్నారు.

ముంబయి–ట్యుటీకోరిన్ మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికుల సౌకర్యార్థం ముంబయి–ట్యుటీకోరిన్‌కు కడప మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వేస్టేషన్ మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. నేటి నుంచి 28వ తేదీ వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 1.15 గంటలకు ఈ రైలు ముంబయిలో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 5.38 గంటలకు కడపకు చేరుతుందన్నారు. అనంతరం కడప నుంచి బయలుదేరి శనివారం రాత్రి 11 గంటలకు ట్యుటీకోరిన్‌కు చేరుతుందని వివరించారు. అలాగే ఇదే రైలు తిరుగు ప్రయాణంలో ఈనెల 9 నుంచి 30 వరకు ప్రతి ఆదివారం నడవనుందన్నారు.

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్ రామ్

• ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా, మేయర్ సురేష్ బాబు
• వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘన నివాళి

కడప కార్పొరేషన్ : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆదర్శప్రాయుడని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు ఇ. చైతన్య, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు మహావీర్ సర్కిల్‌లో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి గజమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా పనిచేసిన బాబూ జగ్జీవన్ రామ్ ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటివి కల్పించారన్నారు. జగ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకొని దివంగత వైఎస్సార్ పాలన సాగించారని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి బాటలోనే పయనిస్తూ, తన ప్రభుత్వంలో దళితులకు కీలక పదవులు ఇచ్చి పాలనలో భాగస్వామ్యం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ నాయక్, జి.గరుడాద్రి, త్యాగరాజు, మేసా ప్రసాద్, బండి ప్రసాద్, సంపత్, బాలక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ సీఎం, మేయర్

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి

50 కుటుంబాల చేరిక



వైఎస్సార్ సీపీలోకి చేరినవారితో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి , వైఎస్ మనోహర్ రెడ్డి

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో గతంలో వేముల మండలం చింతలజూటూరు గ్రామానికి చెంది ప్రస్తుతం పులివెందుల పట్టణంలోని నివాసముంటున్న సుమారు 50కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన మారుతి మోహన్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, రామలక్ష్మారెడ్డిలతోపాటు సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం చేసే విధంగా ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలు చూసి చాలామంది వైఎస్సార్‌సీపీలోకి వస్తున్నారన్నారు. అనంతరం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ బయపురెడ్డి, వేల్పుల రాము, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీనారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై సత్యాగ్రహ దీక్ష చేస్తా

– ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు: టీడీపీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి మూడు హత్యలు జరగబోతాయని చెప్పిన విషయమై పోలీసులు రెండు రోజుల్లో బహిరంగ ప్రకటన చేసి శాంతి భద్రతలను కాపాడాలని.. లేకుంటే వారిపైనే సత్యాగ్రహ దీక్ష చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో త్వరలో మూడు హత్యలు జరుగుతాయని ప్రవీణ్ మీడియా ద్వారా వారం క్రితం ప్రకటించి ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించాడన్నారు. ఈ క్రమంలో తన నిజాయితీని నిరూపించుకోవడంతోపాటు శాంతి భద్రతలను కాపాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్పీ, ఏఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాలని.. విచారణ జరిపి అది నిజమా, అబద్ధమా అని ప్రజలకు బహిరంగంగా చెపాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. అవసరానికి తగినట్టు పూటకోమాట చెప్పడం ప్రవీణ్‌కు అలవాటుగా మారిందని మండిపడ్డారు. ప్రవీణ్ గోవాలో ఉన్నాడని, ఢిల్లీకి వెళ్లాడని.. ఆరోగ్యం బాగోలేదని కుంటి సాకులు చెప్పి పోలీసులు కాలయాపన చేయడం తగదన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

– 20 గొర్రెలు మృతి

వీరపునాయునిపల్లె: మండలంలోని మిట్టపల్లె గ్రామంలో గురువారం తెల్లవారుజామున గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి బీభత్సం సృష్టించాయి. ఈ దాడిలో 20 గొర్రెలు మృతి చెందాయి. వివరాల్లోకి వెళితే.. పిట్టి సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, ఓబులేసు రోజులాగే గొర్రెలను రాత్రి దొడ్లోకి తోలారు. రాత్రంతా కాపాలా కూడా ఉన్నారు. తెల్లవారుజామున ఇళ్లకు వెళ్లొచ్చేసరికి మందపై కుక్కలు దాడిచేశాయని.. ఈ దాడిలో 20గొర్రెలు మృతి చెందాయని వాపోయారు. దాదాపు 50లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గొర్రెల మందపై కుక్కలు దాడిచేసిన విషయం తెలుసుకొన్న పశు వైద్యాధికారి సునీత సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గతేడాది కూడా కుక్కలు ఇలాగే దాడి చేశాయని.. ఇప్పుడూ అలాగే జరిగిందని.. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న సునీత

గండికోట ముంపువాసులకు రూ.454.60 కోట్లు మంజూరు

జమ్మలమడుగు : గండికోట ముంపువాసులకు పరిహారం పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం గురువారం 454.60 కోట్లు నిధులు విడుదల చేస్తూ జీఓ జారీ చేసింది. ప్రస్తుతం తొలి విడతలోని 14 గ్రామాల ముంపువాసులకు అందజేయాల్సిన పెండింగ్ నిధులతో పాటు మరో 8 గ్రామాల్లోని మిగిలిన ముంపువాసులకందరికీ ఏకకాలంలో పరిహారం పంపిణీ చేయడం కోసం ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడం విశేషం.

మాట మీద నిలబడ్డాం



గండికోట ముంపువాసులకు పదిలక్షల రూపాయలు పరిహారం ఇస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఇచ్చిన హామి మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు, మూడు విడతల్లో పరిహారం నిధులు విడుదల చేశారు. ప్రస్తుతం మొదటి విడత 14 గ్రామాల ప్రజలకు ఒక్కొక్కరికి 3.25లక్షలతో పాటు మిగిలిన ప్రతి ఒక్కరికి పరిహారం పంపిణీ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 454.60 కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేయడం సంతోషకరం. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం.

– మూలె సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యే

ఆనందంగా ఉంది...



ముంపువాసులందరికీ పూర్తిగా పరిహారం మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకోసం కృషి చేసిన ఎంపీ వైఎస్అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు. ఇచ్చిన హామీ మేరకు ముంపువాసులందరికీ పదిలక్షల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి నేడు దానిని నెరవేర్చడం ఎంతో సంతోషంగా ఉంది.

– హరినారాయణ రెడ్డి, తాళ్ల ప్రొద్దుటూరు

గవర్నర్‌ను కలిసిన వైవీయూ వీసీ

– విశ్వవిద్యాలయ ప్రగతి గురించి వివరించిన అధికారులు

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల చాన్సలర్ ఎస్. అబ్దుల్‌నజీర్‌ను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతి, ఇటీవల పొందిన న్యాక్ ఏ గ్రేడ్, జాతీయస్థాయిలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో సాధించిన అభివృద్ధి గురించి వివరించారు. విశ్వవిద్యాలయాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్లాలని, తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని గవర్నర్ పేర్కొన్నారు.



గవర్నర్‌ను కలిసిన వీసీ సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య